క్లుప్తంగా

విజయవాడ కనకదుర్గను దర్శించుకున్న మంత్రి


అమ్మవారి ఫొటో బహూకరిస్తున్న అధికారులు

ధర్మపురి: విజయవాడ కనకదుర్గను రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా మంత్రికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అధికారులు అమ్మవారి పట్టువస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, ఫొటో అందజేశారు.

కేటీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు


కేటీఆర్‌తో సెల్ఫీ దిగుతున్న స్థానిక నాయకులు

కోరుట్ల: రాష్ట్ర ఐటీ,మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును కోరుట్ల బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిశారు. హైదరాబాద్ నుంచి జగిత్యాలకు వెళ్తున్న మంత్రి కొంత సేపు కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆగారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు కేటీఆర్‌ను కలిసి, ఆయనతో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్, మునిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, నాయకులు పాల్గొన్నారు.

అష్టోత్తర శత చక్ర ర్యాలీ ప్రారంభం


ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్/జగిత్యాల రూరల్: జగిత్యాల మండలం పొలాస సహస్ర(వేయి)లింగాల ఆలయంలో మాస శివరాత్రి ప్రత్యేక పూజల సందర్భంగా అష్టోత్తర శత చక్ర వాహన ర్యాలీని జగిత్యాల పట్టణం ధరూర్ క్యాంపు కోదండ రామాలయం వద్ద ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రారంభించారు. దాదాపు వందకు పైగా భక్తులు తమ వాహనాల్లో పొలాసలోని సహస్ర లింగాల ఆలయానికి ర్యాలీగా తరలివెళ్లారు. ర్యాలీలో పాల్గొన్న భక్తులకు అమ్మవారి ప్రసాదంతో పాటు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆవారి శివకేసరి, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

రాయికల్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆగస్టు 1వ న నిర్వహించే చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి బన్న హరీశ్ కోరారు. ఆదివారం రాయికల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఆగస్టు 1 పరేడ్‌గ్రౌండ్‌లో విద్యార్థులతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, సభకు విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై విజయవంత చేయాలన్నారు. కార్యక్రమంలో కార్తీక్, మనోజ్, శశి, నందు,వంశీ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన బీర్‌పూర్ ఎస్సై


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై గౌతంపవార్

సారంగాపూర్: బీర్‌పూర్ ఎస్సైగా గౌతం పవార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల డీసీఆర్‌బీలో ఉన్న గౌతం పవార్‌ను బీర్‌పూర్‌గా ఎస్సైగా నియమించగా, బాధ్యతలు స్వీకరించారు. ఎస్సైకి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అన్నీ తరగతి గదిలోనే..

- గురుకులంలో సమస్యల తిష్ట
- చదవడం, పడుకోవడం ఒకే చోట
- డైనింగ్‌హాల్, ప్రహరీ లేక విద్యార్థుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


డైనింగ్‌హాల్ లేక చెట్ల కింద టిఫిన్ చేస్తున్న విద్యార్థులు

రాయికల్: నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, వసతి కల్పించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సమస్యలు తాండవిస్తున్నాయి. రాయికల్ మండలం అల్లీపూర్‌లో మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉండగా, ఇందులో 480 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల కోసం గతంలో 12 తరగతి గదులు ఉండగా, ఇటీవల మరో 4 అదనపు తరగతి గదులను నిర్మించినప్పటికీ తరగతి గదుల కొరత తీరకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గురుకులంలో సమస్యల తాండవం..

మహాత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో పాటు అదే తరగతి గదిలో చదువుకోవడంతో పాటు, అదే గదిలో పడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా విద్యార్థులకు వసతి గృహం, డైనింగ్‌హాల్ లేకపోవడంతో చెట్ల కిందనే భోజనం, అల్పాహారం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షం కురిస్తే తరగతి గదుల్లోకి వెళ్లి తింటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులు కూర్చునేందుకు బెంచీలు, పడుకునేందుకు బెడ్స్ సైతం లేకపోవడంతో కింద కూర్చునే చదువుకోవడం, రాత్రుల పూట కిందనే పడుకోవాల్సి వస్తుంది. అలాగే పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో చెట్ల పొదల నుంచి పాములు, తేళ్లు రావడంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలకు గురుకులంలో క్రీడా సౌకర్యార్థం క్రీడా మైదానం లేకపోవడంతో క్రీడలకు దూరమవుతున్నామని క్రీడాకారులు అంటున్నారు. గతంలో గురుకులాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా కలెక్టర్, ఆర్డీవో సందర్శించినప్పటికీ తరగతి గదుల సమస్య మాత్రం తీరడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించి మహాత్మ జ్యోతిబాపూలే గురుకులంలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


బెంచీలు లేక కిందనే కూర్చున్న విద్యార్థులు

పట్టించుకోవడం లేదు



మా గురుకుల పాఠశాలలో తరగతి గదుల సమస్య తీవ్రంగా ఉంది. వసతి గృహం లేకపోవడంతో చదువుకున్న గదిలోనే పడుకుంటున్నాం. వర్షం పడితే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా సమస్యలు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి సమస్య తీర్చాలి.

– సుషాంత్, 9వ తరగతి విద్యార్థి

సమస్యలు పరిష్కరించాలి



విద్యార్థి మా గురుకుల పాఠశాలలో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రుల పూట ఇబ్బందులు పడుతున్నాం. క్రీడాకారులకు క్రీడా వసతులు సరిగా లేకపోవడంతో క్రీడలకు దూరమవుతున్నాం. డైనింగ్ హాల్ వెంటనే నిర్మించాలి.

– మోక్షిత్, 9వ తరగతి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గురుకులంలో నెలకొన్న సమస్యలను రీజినల్ కో–ఆర్డినేటర్ దృష్టికి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. తరగతి గదుల కొరత ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గదులు నిర్మిస్తే బెంచీలు మంజూరవుతాయి.

– వెంకటరమణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి


మల్లాపూర్‌లో ధర్నా చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

మల్లాపూర్: గిరిజన మినీ గురుకుల బాలికల పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆదివారం మల్లాపూర్ గిరిజన మినీ గురుకుల పాఠశాల ఎదుట కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించడం దారుణమన్నారు. జీవో నెం.41 ప్రకారం గిరిజన మినీగురుకుల ఉపాధ్యాయులకు రూ.31,040, సిబ్బందికి రూ.22,750ల వేతనాలను పెంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. 24 ఏళ్లుగా గిరిజన మినిగురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోరిసింగ్ ఉద్యోగులను పట్టించుకోకపోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. టీఆర్‌టీలో బీ.ఎడ్, డీ.ఎడ్ చేసిన మినీగురుకుల ఉపాధ్యాయులకు వెయిటేజీ మార్కులతో పాటు మహిళలకు వేతనం కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరణిస్తే వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సుమలత, శ్రీలత, సులోచన, చంద్రకళ, అరుణ, నవిత, తిరుపతమ్మ, సుగుణ, లక్ష్మీ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒడ్డె లింగాపూర్‌లో..

రాయికల్: మినీ గురుకులంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఆదివారం మండలంలోని ఒడ్డెలింగాపూర్ మినీ గురుకులం వద్ద కాంట్రాక్ట్ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా జనరల్ సెక్రటరీ అజ్మీరా కవిత మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సుప్రీంకోర్టు తీర్పు సమాన వేతనం ప్రకారం ఒప్పంద ఉద్యోగులకు 11వ పీఆర్సీలోకి బేసిక్ పే అమలు చేయాలని, మినీ గురుకులంలోని బోధనా సిబ్బందికి రూ.31040 బోధనా సిబ్బందికి, రూ.22,750 అకౌంటెంట్‌కు రూ.19,500 వర్తింపచేయాలని, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కవిత, కళ, మంజుల, స్వప్న, సుజాత, అఖిల, గంగజల, రాధ, సరోజ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహించొద్దు


పనులు పరిశీలిస్తున్న డీఎల్పీవో శంకర్

కథలాపూర్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ర్లక్ష్యం చేయవద్దని కోరుట్ల డీఎల్పీవో శంకర్ అన్నారు. మండలం బొమ్మెన, భూషణరావుపేట గ్రామాల్లో ఆదివారం పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామశివారుల్లో కమ్యూనిటీ ఇంకుడుగుంతలు నిర్మించాలన్నారు. గ్రామపంచాయతీలకు మంజూరైన కొత్త భవనాలు ఎందుకు పనులు ప్రారంభించలేదని కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీవో గంగాధర్, కార్యదర్శులు ఎం.డీ గఫూర్, మహేశ్, కూన శ్రీనివాస్, అంబల్ల అశోక్ ఉన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ


ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ సిబ్బంది,రైతులు

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ శివారులో దెబ్బతిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ అధికారులు ఆదివారం పునరుద్ధరించారు. రెండు నెలల క్రితం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానలకు వ్యవసాయ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు విరిగి పడ్డాయి. విద్యుత్ స్తంభాల కొరతతో విరిగిన స్తంభాలు ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించలేదు. వర్షాకాలంలో పంటల కోసం రైతులు ఆందోళన చెందటంతో స్పందించిన విద్యుత్ రూరల్ ఏఈ శ్రీనివాస్ స్తంభాలు, ట్రాన్స్‌పార్మర్లను పునరుద్ధరించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గంధంగా ఆలయ పరిసరాలు


ఆలయం వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

బుగ్గారం: మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ,నల్లపోచమ్మ ఆలయ పరిసరాలు దుర్గంధంగా మారాయి. ప్రస్తుతం పంచాయతీ కార్మికులు సమ్మెబాటలో ఉండడంతో గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ లేక, చెత్త చెదారం తొలగించేవారు లేక వీధులన్నీ దుర్గంధంగా మారుతున్నాయి. మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ ఆలయానికి ప్రతీ ఆది,గురువారాల్లో వందలాది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుని వెళ్తుంటారు.అనేక మంది ఆలయం సమీపంలోనే వంటలు చేసుకొని భోజనాలు చేసి తిరిగి వెళ్తుంటారు.ఈ క్రమంలో ఆలయ పరిసరాలలో నిత్యం పెద్ద ఎత్తున చెత్తచెదారం పోగవుతోంది. పంచాయతీ సిబ్బంది సమ్మెలో ఉండడంతో చెత్తను తొలగించేవారు లేక ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి.ఆలయ ముందు చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భగవద్గీత సప్తాహం ముగింపు ఉత్సవాలు


ప్రసంగిస్తున్న స్వామిజీలు

కథలాపూర్: మండలం చింతకుంటలో శ్రీ తారకేశ్వర స్వామి ఆలయంలో భగవద్గీత సప్తాహం ముగింపు ఉత్సవాలు ఆదివారం రాత్రి జరిగాయి. భక్తులకు సందేశం ఇచ్చి ధర్మాన్ని ఆచరించాలని, ప్రతీరోజు దేవుళ్లను పూజించాలని స్వామిజీ అన్నారు. ఈ ఉత్సవాల్లో సత్యానందాశ్రమ పడిగల పీఠాధిపతి విరజానందస్వామి, విశోఖ తీర్థ స్వామి, మాత హరిప్రియ, భక్తులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ నుంచి వెళ్లిన నేతలు తిరిగి రావాలి'

మెట్‌పల్లి: కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లిన నాయకులు తిరిగి పార్టీలోకి రావాలని పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజీత్‌రావు అన్నారు. ఆదివారం మెట్‌పల్లిలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500 వంటగ్యాస్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఇల్లు లేని వారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షల సాయం, గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేయాలనే ఆలోచన చేస్తుందన్నారు. ప్రజల్లో రోజురోజుకు కాంగ్రెస్ పట్ల ఆదరణ పెరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

పూర్తయిన పంచాయతీ భవనాలు

- బిల్లులు రాక సర్పంచుల అవస్థలు
- ప్రారంభంలో జాప్యం



మ్యాక వెంకయ్యపల్లిలో పూర్తయిన జీపీ భవనం

పెగడపల్లి: మండలంలోని రాజరాంపల్లి, మ్యాకవెంకయ్యపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఇంతకుముందు పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనాల నిర్మాణానికి మంత్రి ఈశ్వర్ చొరవ చూపి ఉపాధిహామీలో ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేయించారు. భవన నిర్మాణాలను ఆయా గ్రామాల సర్పంచులు చేపట్టారు. రాజరాంపల్లిలో జీపీ భవనం ఆరు నెలల క్రితం పూర్తి కాగా, నెల రోజుల కిందట మ్యాకవెంకయపల్లిలో పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచారు. భవనాల పనులు వంద శాతం పూర్తికాగా బిల్లులు మాత్రం సగం మేరకు చెల్లింపులు జరిగాయి. బిల్లులు పూర్తి స్థాయిలో చెల్లింపులు కాకపోవడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచులు వాపోతూ పూర్తయిన పంచాయతీ భవనాలు ప్రారంభించేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అధికారుల ఒత్తిడి మేరకు అప్పుచేసి భవన నిర్మాణం చేపడితే బిల్లుల చెల్లింపుల జాప్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల విషయంపై అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేక పోతుందని వాపోయారు. తమకు రావాల్సిన బిల్లు చెల్లించాలని సర్పంచులు వేడుకుంటున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ శంషేర్ అలీని వివరణ కోరగా తాను ఎంబీ రికార్డు చేసి పంపించానని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల వినూత్న నిరసన


గొల్లపల్లిలో ఒంటికాలుపై నిలబడి నిరసన తెలపుతున్న పంచాయతీ కార్మికులు

సారంగాపూర్: తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 11వ రోజు ఆదివారం బీర్‌పూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు భిక్షాటన చేశారు. ప్రభుత్వం రానున్న రోజుల్లో తమ డిమాండ్లను నెరవేర్చకపోతే తమ కుటుంబాల పరిస్థితి ఇదే స్థితిలో ఉండనుందని వారు ఆవేదన వ్యక్తం చేసారు. సారంగాపూర్‌లో గ్రామపంచాయతీ కార్మికులు తల కిందికి చేసి కాళ్లు పైకి ఉంచి ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు.


బీర్‌పూర్‌లో భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

రాయికల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయ ఆవరణ లో చేస్తున్న సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరింది. ధర్మసమాజ్ పార్టీ సభ్యులు వీరికి సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని 11వ పీఆర్సీ ప్రకారం 19500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రచార కమిటీ నాయకులు జీవన్ మహారాజ్, స్వామి మహారాజ్, సురేందర్ మహరాజ్, రాజగణేశ్ పాల్గొన్నారు.

ఒంటి కాలుపై నిలబడి నిరసన

గొల్లపల్లి: పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా ఆదివారం గొల్లపల్లిలో కార్మికులు ఒంటికాలుపై నిలబడి నిరసన తెలిపారు.కార్మికులకు బీఎస్పీ పార్టీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క విజయ్, మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు తడగొండ కార్తీక్, బచ్చల అంజి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జంగిలి ఎల్లయ్య, రాజేశ్వర్, సంజీవ్, శేఖర్, మహేశ్, మల్లేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోటాపోటీగా మున్నూరుకాపు సంఘం ఎన్నికలు


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

ధర్మపురి: పట్టణంలోని మున్నూర్ కాపు సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన మున్నూరు కాపు సంఘం ఎన్నికలు పోటా పోటీగా సాగాయి. అధ్యక్ష స్థానానికి ముగ్గురు పోటీ చేయగా, అధ్యక్షుడిగా చీపిరిశెట్టి రాజేశ్ ఎన్నికయ్యాడు. మొత్తం 517 ఓట్లలో రాజేశ్‌కు 208 రాగా, ప్రత్యర్థి లసెట్టి మహేశ్‌కు 169, బండి మహేశ్‌కు 133 ఓట్లు రాగా 9 ఓట్లు చెల్లలేదు. మిగిలిన స్థానాలు ఏకగ్రీవంగా సాగాయి. ప్రధాన కార్యదర్శిగా బండారు లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా సోమిశెట్టి శివసాయి, స్తంభంకాడి మహేశ్, ఆర్థిక కార్యదర్శిగా కాశెట్టి రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా ఒడ్నాల భూమేశ్, పానుగంటి రవి, కార్యదర్శులుగా చల్ల రవి, బండారు తిరుపతి, చుక్క రవి, చుక్క భీంరాజ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా చెరుకు రాజన్న, సంగి నర్సయ్య, బండి మురళి వ్యవహరించారు.

మున్నూరుకాపు సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

కోరుట్ల: పట్టణంలోని కాల్వగడ్డ మున్నూరు కాపు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుర్రాల వెంకటనర్సయ్య, కార్యదర్శిగా గుర్రాల రాములు, కోశాధికారిగా చింతకింది వెంకటేశ్వర్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బంగారి రాజేశ్వర్, సాగవెంకటి, గోపు గంగాధర్, సుతారి అశోక్, ఎన్నికల అధికారులు గుర్రాల హరికృష్ణ, రాజేంద్రప్రసాద్, పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాధిత కుటుంబాలకు సాయం

మల్లాపూర్: మండలంలోని సిరిపూర్‌లో ఆదివారం బాధిత కుటుంబాలకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సాయం అందించారు.ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కర్రె జగదీశ్, మొక్కన్న లక్ష్మీనర్సయ్యచారి కుటుంబాలకు నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల బాపురెడ్డి, నాయకులు గడ్డం శ్రీధర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు రాజ్‌కుమార్, మణిదీప్, రాజేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన ఎర్దండి వెకంటి అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి ఆదివారం డ్రీమ్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సామల్ల లావణ్య, యూత్ అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, సభ్యులు సంతోష్, రంజిత్, అనుపురం కార్తీక్ గౌడ్, గంగరాజం, ముత్తన్న, నరేష్‌లు పాల్గొన్నారు.

ఆవును రక్షించిన స్థానికులు

జగిత్యాలటౌన్: జగిత్యాల కొత్త బస్టాండ్ సర్కిల్‌లో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలపాలైన ఆవును గుర్తించిన స్థానికులు పశువుల ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్లాపూర్: మండలంలోని రాఘవపేటలో తోట సంతోష్, తోట లక్ష్మారెడ్డి నాన్నమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని ఆదివారం ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి, రాజోజి సదానందచారి తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పొలం పనులు



పెగడపల్లి: గ్రామాల్లో వానకాలం సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని 23 గ్రామాలకు 21 గ్రామాలు ఎస్సారెస్పీ ఆయకట్టు ప్రాంత పరిధిలో ఉన్నాయి. దీనికి తోడు ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోంది. వ్యవసాయ బావుల కింద నార్లు పోసిన రైతులు వరి నాట్లు వేయుటలో బిజిబిజీగా ఉన్నారు. ఈ వానకాలంలో మండలంలో సుమారు 26 వేల ఎకరాలకు పైగా వరి సాగు కావొచ్చని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.